

బావ అక్కను పెళ్లి చేసుకుంటాడని ముహూర్తం పెట్టి పంపవలసిందని అత్తయ్య ఉత్తరం రాసిందట. అమ్మ ఆ విషయం ఎంతో సంబర పడిపోతూ నాతో చెప్పింది. కాని ఆ విషయం నాకు సంతోషాన్ని కలిగించలేదు. మొట్టమొదటిసారిగా బావపైన కోపం వచ్చింది నాకు, నన్నుకాదని అక్కను చేసుకుంటున్నందుకు. ఏడ్పుకూడా వచ్చింది.

అక్కకంటే నేనే ఎర్రగా వుంటాను. పెద్ద పెద్ద చక్రాల్లాంటి కళ్లతో అందంగా, ఆకర్షణీయంగా వుంటాను. అక్కయ్య పి. యు. సి. చదివి అంతటితో వూరుకుంది. నేను బి. యస్. సి. ఫస్టు యియర్ చదువుతున్నాను. అలాంటప్పుడు బావ నన్ను కాదని, అక్కయ్యలో ఏం చూసుకొని ఎన్నుకున్నాడో అర్థం కాలేదు నాకు. కావైతే అక్క నాకంటే నాక ఏడాదే పెద్ద. ఆమెగారికి పందొమ్మిది, నాకు పద్దెనిమిదేళ్లు వున్నాయి. చూడ్డానికి అక్కకంటే నేనే పెద్దదాన్నిగా కనిపిస్తాను.

అమాయకంగా మెత్తగా కనబడే అక్క బావను తనవలతో వేసుకున్నందుకు ఆమె మీద కోపం వచ్చింది నాకు. ఆ తర్వాత ఆమెను వరించబోయే భోగభాగ్యాలను తలచుకునేసరికి ఈర్ష్యపుట్టింది. అక్క నా సొంత అక్కయ్యే అయినా నామనస్సు ఆమెను పరాయిదానిగా భావించసాగింది.

ఆ రాత్రి ఎప్పుడూ అక్క ప్రక్కన పడుకునే నేను మరో గదిలోకి వెళ్లి పడుకున్నాను. అక్కవచ్చి పిలిచినా నేను లేచి వెళ్లలేదు. అనవసరంగా ఆమెను కసురుకున్నాను. అలా పడుకున్నానే మాటే కాని నాకు నిద్రపట్టలేదు. బావను గురించి ఆలోచించకుండా నిద్ర పోదామనుకున్నాను కాని అది నాకు సాధ్యపడలేదు—

ఆ రోజు బావ తన వుద్యోగప్రయత్నం మీద హైదరాబాద్ వచ్చాడు. అతను వచ్చిన వేళావిశేషం ఎటువంటిదో గాని ఏమంత శ్రమపడకుండానే వో పెద్ద ఎలక్ట్రిక్ యిండస్ట్రీస్ (ప్రయివేటు)కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా వుద్యోగం దొరికిందతనికి. ఆ కంపెనీ బ్రాంచి ఆఫీసు విజయవాడలో వుందిట. బావ అక్కడ పని చెయ్యాలిట.

'కంగ్రాచ్యులేషన్స్ బావా! నీకు వుద్యోగం దొరికిందిగా ... మా అందరికీ పార్టీ 'ఇవ్వాలి'. అన్నాను ప్రయాణానికి సిద్ధమౌతున్న బావను సమీపించి.

'తప్పకుండా పార్టీ అందరికీ యిస్తాను. నీకు మరో స్పెషల్‌కూడా వుంది.' అన్నాడు.

'ఏమిటది?' అడిగాను నా పెద్దకళ్లను మరి పెద్దవిగాచేసి.

సూట్‌కేస్ సర్దుకుంటున్న వాడల్లా నావైపు తిరిగి నా ముఖంవైపు ఎలాగో చూశాడు. ఆ వెంటనే తన రెండుచేతులతో నా ముఖాన్ని పట్టుకొని, నా పెదాల్ని గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

అనుకోని ఈ సంఘటనకు నేను ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

'ఛీ! ఏమిటిది బావా ... వదులు.' అంటూ బలంగా బావ చేతుల్ని విడిపించుకుని విసురుగా ఆ గదిలోనుంచి బయటికి వచ్చేశాను.

జరిగింది ఎవరూ చూడలేదు కాబట్టి సరిపోయింది. అదే ఎవరైనా చూస్తుంటే రభస చేసేదాన్ని. ఎంత మేనత్తకొడుకైతే మాత్రం మరీ అంత చనువా?

బాత్‌రూంలోకి వెళ్లి నీళ్లతో ముఖం కడిగేసుకున్నాను. అలా కడిగేసుకుని వచ్చేసరికి బావ వూరు వెళ్లిపోయాడని మాటల సందర్భంలో అమ్మ చెప్పింది.

వారం పదిరోజుల తర్వాత బావ వద్దనుండి నాన్నగారికి వుత్తరం వచ్చింది. అందులో తను ఉద్యోగంలో చేరినట్టు, అరవైరూపాయలకు ఒక ఇల్లు అద్దెకు తీసుకొని అత్తయ్యను మాజిపేడునుండి తీసుకు వచ్చేసినట్టు రాశాడు.

మరో నెలరోజుల తరవాత—

ఓ రోజున నేను నిద్రలేచేసరికి బావ వచ్చివున్నాడని తెలిసింది. ఆ మరుక్షణం నుంచే నా కళ్ళు అతనికోసం వెతికాయి. నాన్నగారి గదిలో మంచంమీద నిద్రపోతూ కనిపించాడు బావ. పాపం. రాత్రంతా ప్రయాణం మూలంగా నిద్రలేదేమో వళ్ళు మైమరచి నిద్రపోతున్నాడు.

నేను స్నానం చేస్తుండగా గుమ్మం దగ్గర ఏదో అలికిడయ్యింది. 'ఏమిటా' అని అటువైపు చూశాను. అక్కడ బావ నిలబడివున్నాడు. నేను ఒక్కసారిగా నిర్ఘాంత పోయాను. అతను నావైపే చూస్తున్నాడు. వెంటనే నాచేతికి అందుబాటులో వున్న టవల్‌ను అందుకొని సాధ్యమైనంతవరకూ వళ్ళు కప్పేసుకున్నాను. బావ అక్కడ్నుండి వెళ్ళిపోయాడు. ఇదంతా కొన్ని క్షణాల్లో జరిగిపోయింది. అసలు బావ అక్కడికి ఎలా రాగలిగేడో నాకర్థం కాలేదు. కాస్సేపటికి గుర్తుకొచ్చింది స్నానం చేస్తున్నప్పుడు లోపలినుండి గడియ వేసుకోవటం నేను మర్చిపోయానని.

ఆ తర్వాత బావ ఎదుట పడకుండా ఎలాగో నాలుగు మెతుకులు తిని కాలేజీకి వెళ్ళిపోయాను. ఆ రోజు శనివారం కాబట్టి కాలేజీనుండి తిరిగివస్తూ చిక్కడపల్లిలోవున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళాను. ప్రతీ శనివారం ఆ గుడికి వెళ్ళటం అలవాటు నాకు.

దేవుని దర్శనం చేసుకొని, గుళ్ళోనుండి బయటికి వస్తున్న నాకు తలవనితలంపుగా బావ కనిపించాడు. అతను కనిపించేసరికి సాక్షాత్తు దేవుడే కనిపించినంతగా వుబ్బిపోయాను. ఎందుకో బావతో మాట్లాడ్డానికి అక్కడ బిడియపడ్డాను.

'దేవుని దర్శనమయిందా ?' చిరునవ్వు ముఖంతో పలకరించాడు బావ.

'అయింది.' అన్నాను మెల్లిగా.

'మరి అమ్మాయిగారు ఏం కావాలని కోరుకున్నారో దేవుని దగ్గర ?' అడిగాడు చిలిపిగా.

'నువ్వు కావాలని' అని అందామనుకున్నాను. కాని మరీ అంత సిగ్గువిడిచి చెప్పేయలేకపోయాను.

నా వద్దనుండి జవాబు రాకపోయేసరికి, 'ఏమని కోరివుంటావులే. అందగాడూ, డబ్బూ హోదా గలవాడు, మంచివాడు భర్తగా దొరకాలని కోరుకొని వుంటావు. అంతేనా ?'

'నేనేమని కోరుకున్నానో అంతగా తెలుసుకోవాలనివుంటే, వెళ్ళి ఆ దేవుణ్ణే అడిగి తెలుసుకోరాదూ.'

'అబ్బో ! చాలా తెలివిగా మాట్లాడుతున్నావే ?'

'ఆ!...నా తెలివికేంగాని, ఈ రోజు వుంటావా ?' అంటూ ప్రసంగాన్ని మళ్ళించాను.

'లేదు. కంపెనీ పనిమీద వచ్చాను. ఆ వచ్చిన పని అయిపోయింది. తిరిగి ఈ రాత్రికే వెళ్ళిపోతున్నాను'...అని మళ్ళీ 'పోతూ పోతూ ఏదో దేవుని దర్శనం చేసుకునిపోదామని వచ్చాను. ఆ దేవుని దర్శనానికి ముందే ఈ అందాలదేవిగారి దర్శనమయింది.' అన్నాడు.

ఆ మాటకి నేను సిగ్గుపడ్డాను. బావ ముఖంలోకి సూటిగా చూడకుండా 'ఏమిటా మాటలు బావా! ఎవరైనా వింటే ఏమనుకుంటారు?' అన్నాను మెత్తగా మందలించే ధోరణిలో.

'ఏమనుకుంటారూ? నీతో మాట్లాడుతున్నందుకు నన్ను చూసి ఈర్ష్యపడతారు ...యిక పోతే నిన్ను చూసి...'

ఇంకా ఏదో చెప్పబోతున్న బావకు అడ్డు తగిలి—

'నువ్వు అలా మాట్లాడితే నేను వెళ్ళిపోతాను.' అన్నాను.

'సరే. ఇక నువ్వు పొగడమన్నా పొగడను. కాని గుళ్ళోకి వెళ్ళి వద్దాం పద.' అన్నాడు బావ.

'నే నెందుకూ! నేనిప్పుడేగా వెళ్ళి వచ్చాను.'

'నువ్వు కోరుకున్నదేమిటో ఆ వెంకటేశ్వరస్వామి సరిగా వినలేదట. అలా అని ఆయన నాతో చెప్పాడు. పద మరోసారి ఆ స్వామికి వినబడేటట్టు చెబ్బువుగాని.'

నేను తిరిగి బావతో దేవదర్శనానికి వెళ్ళాలా వద్దా అని వో క్షణం ఆలోచించి వెళ్ళడానికే సిద్ధపడ్డాను. కాని అంతలోనే నా తోటి విద్యార్థిని సుందరి కనిపించి 'ఏమే మీనా! యింటికి వెళ్తున్నాను. వస్తావా పోదాం.' అంది.

సుందరి వాళ్ళ యిల్లు కూడ మా యింటికి వెళ్ళే దార్లోనే వుంది. నాకు ఏటు చెప్పడానికీ తోచలేదు. నా నుండి జవాబు రాకపోయేసరికి—

'అయామ్ సారీ ! ఎవరితోటో మాట్లాడుతున్నట్టున్నావ్. నేను వెళ్తాను మరి.' అంటూ వెళ్ళబోయింది సుందరి.

'వుండవే నేను వచ్చేస్తున్నాను' అని, బావవైపు తిరిగి 'నేను యింటికి వెళ్తాను బావా. చీకటి పడుతుందిగా. ఇంటి దగ్గర అమ్మావాళ్ళూ నేనింకా కాలేజీనుండి రానందుకు గాభరాపడుతూ వుంటారు. మరో విధంగా భావించకు. ఎక్స్‌క్యూజుమి.' అన్నాను ప్రాధేయపూర్వకంగా.

బావ మాట్లాడలేదు.

'స్నేహితురాలు నాగురించి నిలబడి వుంది. వస్తాను మరి' అని చెప్పి వచ్చేశాను.

అలా ఇంటికి వచ్చేసింతర్వాత, బావ కోరికను కాదన్నందుకు బాధపడ్డాను. బావతో గుళ్ళోకి వెళ్ళివుండ వలసింది. నేను తనతో రానందుకు బావ కోపగించుకొని వుంటాడు, అనుకున్నాను.

అందుకే నన్నుకాదని బావ అక్కను పెళ్ళి చేసుకుంటున్నాడేమో? అన్న సందేహం కలిగింది. కాని అదే సరైన కారణమని నాకు అనిపించలేదు. మరి, బావా అక్కయ్యా వొకర్నొకరు ప్రేమించుకున్నారేమో ? అలా అనుకునేసరికి నామనస్సు మూగగా విలపించింది. ఇన్నాళ్ళూ బావతోటే నా జీవితం అనుకున్నాను. పెళ్ళంటూ చేసుకుంటే బావనే చేసుకోవాలి అనుకున్నాను. ఇప్పుడు బావ పరాయివాడౌతూంటే చూసి భరించగలనా? మనస్సంతా ఆ వేదనతో నిండిపోయింది.

ఆ రాత్రి నాకు నిద్ర కరువైంది.

ఆ మర్నాటినుండి నాలో అనుకోని మార్పు వచ్చేసింది. ఇంటా బయటా మితంగా మాట్లాడ్డం మొదలుపెట్టాను. నాలో చురుకుతనం, చిలిపితనం సన్నగిల్లాయి. వాటిస్థానే సోమరితనం, చిరాకూ చోటు చేసుకున్నాయి. చదువులో ఆటల్లో మునుపటి ఉత్సాహాన్ని కనబర్చలేక పోతున్నాను. అసలు నా మనస్సును ఏ ఒక్క పనిమీదా లగ్నం చేయలేక

# నా బావ

పోతున్నాను.

ఒకరిద్దరు స్నేహితురాళ్లు నాలో కలిగిన మార్పును గమనించి కారణ మడిగారు, వంట్లో బాగుండటం లేదని వో చిన్న అబద్ధం ఆడేశాను.

ఇంట్లోవాళ్లు ఎవరి హడావిడిలో వారు వున్నారు. నాన్నగారు పురోహితుణ్ణి సంప్రదించి పెళ్లికి లగ్నం పెట్టించేశారు. ఆ పెట్టిన ముహూర్తం దగ్గర్లోనే వుండటంవల్ల అమ్మా నాన్నా పెళ్లి ఏర్పాట్లలో మునిగి పోయారు. అక్కయ్య ఆనందానికి హద్దంటూ లేదు. ఆమెలో పెళ్లికళ వచ్చేసింది. తనకు కావలసిన చీరలూ, నగలూ కోరికోరి తెప్పించుకుంటూంది. తమ్ముడు గోపి ఆ బట్టలు కావాలి, ఈ బట్టలు కావాలని పట్టుబట్టి మరీ కుట్టించు కుంటున్నాడు. ఆయింట్లో నేను తప్ప అంతా ఆనందంతో హడావిడిగా వున్నారనే చెప్పాలి.

ఎలాగో రోజులు దొర్లిపోతున్నాయి నాకు.

నాన్నగారు వుత్తరంలో తెలియబర్చిన ప్రకారం పెళ్లిరోజుకి రెండు రోజులు ముందుగా మగపెళ్లివారు—అంటే బావా అత్తయ్యావాళ్లు కొంతమంది బంధువులతోటి వచ్చారు. వారందరికీ సత్రంలో విడిది ఏర్పాట్లు నాన్నగారు ముందుగా చేసి వుంచారు.

పెళ్లిరోజు వరకూ బావకు కనిపించకుండా తప్పుకు తిరిగాను నేను. నాకు బావను చూడాలనివున్నా నా హృదయం ఎదురు తిరిగింది. ఆ వచ్చినరోజు రాత్రి అత్తయ్య నా చదువుగురించీ, యింకా అటువంటి విషయాలగురించీ మాట్లాడింది నాతో. నేను ముక్తసరిగా జవాబిచ్చాను. ఆమెతో ఎందుకో మనసిచ్చి మాట్లాడలేక పోయాను. బహుశా, బావపైన నేను లేనిపోని ఆశలు పెంచుకోడానికి అత్తయ్య కొంతవరకూ కారకురాలు కావటమే అందుకు కారణమేమో?

ఆ రోజు రాత్రి పెళ్లిఅనగా నేను వెళ్లి నా ఫ్రెండ్సుని ఆహ్వానించాను. అదీ అమ్మ బలవంతంమీద ఆ పని చేశాను.

పెళ్లి చాలా సందడిగా ఘనంగా జరిగింది. ఆ పెళ్లిపందిట్లో నేను మినహా అంతా కళ కళ లాడుతూ ఎంతో వుత్సాహంతో వున్నట్టు కనిపించారు. మంగళసూత్రధారణప్పుడు అక్కస్థానంలో నేను వున్నట్టుగా చిత్రించుకుని క్షణిక ఆనందాన్ని పొందకుండా వుండలేకపోయాను.

అక్కయ్య అదృష్టవంతురాలు. అందుకే బావను పొందగలిగింది. బావను పొందటానికి అక్క ఎన్నిపూజలు చేసిందో, ఎన్నెన్ని నోములు నోచిందో? దేవుడు ఆమెను కనికరించాడు.

'ఆ దేవుడే నన్ను కనికరించలేదు. ఎందుకనో? నేనుమట్టుకు ఏం తక్కువ పూజలు చేశాననీ?...' అలా నాలో నేను ప్రశ్నించుకున్నాను. 'నా పిచ్చిగాని వున్న బావ వొక్కడూ మేము యిద్దరం. దేవుడు మట్టుకు ఏం చేయగలడు పాపం.' అంటూ సమాధాన పడ్డాను.

పెళ్లినాటి నాల్గవరోజున అక్కతో సహా బావ ప్రయాణమైయ్యాడు. ఇల్లు విడిచి వెడుతున్నప్పుడు అక్క నన్ను కౌగలించుకుని ఏడ్చింది. అక్కను చూస్తూంటే నాకూ ఏడ్పు వచ్చింది. ఏడ్చేశాను.

'అరే! మీనా ఏడుస్తుందా! తన పెళ్లికి లైన్ క్లియర్ దొరికినందుకు సంతోషించ వలసిందిపోయి ఏడుస్తుందా?' అంటూ బావ పరిహాస మాడాడు.

ఆమాటకి అక్కడవున్న వారంతా నవ్వారు. నాకు నవ్వు రాలేదు. పైపెచ్చు బావమీద కోపంవచ్చింది. 'బావ దగాకోరు' అని నాలో కసిగా అనుకున్నాను. పైకి ఎంతో తియ్యగా మాట్లాడుతాడు. లోపల అంతా కుళ్లే.

అక్క బావతో కలిసి వెళ్లిపోయింది. బంధుమిత్రులు ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. పెళ్లిసందడి పూర్తిగా తగ్గిపోయింది.

కొన్నాళ్లుగా మూలపడవేసిన పుస్తకాలను చేతుల్లోకి తీసుకున్నాను. మనస్సు నిలకడచేసి చదువు సాగించాలనుకున్నాను. కాని కొద్దిరోజులదాకా నాకది సాధ్యపడలేదు. అప్పుడప్పుడు బావ గుర్తుకు వచ్చేవాడు. అతని చేష్టలు గుర్తుకు వచ్చేవి. అలాంటప్పుడు నా చదువుకు అంతరాయం కలిగేది. నేను కోరుకున్న బావను పొందలేక పోయినందుకు బాధపడేదాన్ని. నా బాధను ద్వేషంగా మార్చుకొని అక్కయ్యను ద్వేషించుకునేదాన్ని.

బావ తన కంపెనీ పనిమీద నెలకోసారి లేక రెండు నెలలకోసారి హైదరాబాద్‌కి వచ్చేవాడు. బావ ఫలానా రోజున వస్తున్నట్టు ముందుగా అక్క మాకు వుత్తరం ద్వారా తెలియపరిచేది, తన క్షేమ సమాచారాలతో పాటు.

బావ వస్తున్నరోజున నేను కాలేజీకి వెళ్లేదాన్ని కాదు. వొసారి వెళ్లినా మధ్యలోనే వచ్చేసేదాన్ని. ఎందుకో బావను చూడాలని వుండేది. అతన్ని చూసేసరికి



నన్ను నేను మర్చిపోయేదాన్ని అతనితో మునుపటిలాగే చనువుగా మాట్లాడేసే దాన్ని. బావపై అంతకుముందు కలిగిన కోపమూ అలాంటివి నాలో తాత్కాలికంగానే నిలిచి మాయమయ్యాయి.

బావలో కాస్తోకూస్తో మార్పు వచ్చినట్టు గమనించాను. వెనుకటిలాగ మరీ చిలిపిగా మాట్లాడ్డం మానేశాడు. అక్క గురించి అడిగితే అంతంత మాత్రంగానే చెప్పేవాడు. పోయిన ఉగాది పండగకు అక్కయ్యను ఎందుకు తీసుకు రాలేదని అడిగితే, ఏవో అనివార్యకారణాలవల్ల రాలేకపోయామని చెప్పాడు. నాకెందుకో వాళ్ల దాంపత్యజీవితం సరిగా లేదేమో నన్న అనుమానం కలిగింది. దాంతో నా మనస్సుకి వూరట లభించినట్టు ఫీలయ్యాను.

అక్క పెళ్ళయి ఐదునెలలు గడిచిపోయాయి.

ఉన్నట్టుండి ఒకరోజున అత్తయ్య దగ్గర్నుండి నాన్నగారికి వుత్తరం వచ్చింది. అక్కయ్య కడుపుతో వున్నట్టు, నాలుగోనెల అని అందులో రాసివుంది. అది విన్న అమ్మ తను అమ్మమ్మ కాబోతున్నందుకు మురిసిపోయింది. నాన్నగారు సంతోషించారు. వాళ్లతోపాటు ఆ సంతోషాన్ని నేను పంచుకోలేక పోయాను.

ఆ మర్నాడే తమ్ముణ్ణి తీసుకుని అమ్మ విజయవాడ వెళ్ళింది అక్కను చూసి రావటానికి. కాలేజీలకి సెలవులే కాబట్టి నాన్నగారు నన్నుకూడ వెళ్ళి రమ్మన్నారు. కాని నేనే వెళ్ళడానికి నిరాకరించాను ఒకవేళ వెళ్ళినా అక్కడ అక్క అనుభవిస్తున్న సుఖాన్ని చూసి ఓర్వలేనని నాకు తెలుసు. వాళ్ల దాంపత్య జీవితంపై నాకు అసూయ కలగక తప్పదు. నా ప్రవర్తన ఏమిటో అర్థంకాక అందరూ బాధపడవచ్చు. అందుకే వెళ్ళదల్చుకోలేదు.

విజయవాడలో ఓ వారం రోజులుండి అమ్మా తమ్ముడు తిరిగి వచ్చారు.

అక్క నన్నొకసారి రమ్మని మరీ మరీ చెప్పిందట. అలా అని అమ్మ నాతో చెబుతూ, అక్కయ్య నా పేరిట రాసిచ్చిన ఓ చిన్న వుత్తరం నా చేతికిచ్చింది. అది తీసి చదువుకున్నాను. అందులో తను ఎలా సుఖపడుతున్నదీ, బావ తనను ఎంత ప్రేమగా చూసుకుంటున్నదీ, తను విజయవాడలో బావతో తిరిగి చూసిన స్థలాలు మొదలగు వాటిని గురించి రాసింది. ఉత్తరం ముగింపుచేస్తూ నన్నొకసారి రమ్మని రాసింది.

'రాస్తుంది. ఎందుకు రాయదూ... తను అనుభవిస్తున్న సుఖాల్ని ప్రత్యక్షంగాచూసి మరీ ఏడ్వమని రాసింది... చచ్చినా నేనక్కడికి వెళ్లేది లేదు' అని నాలో నేను కసిగా అనుకొని పైకి 'వచ్చేది ఆషాఢమాసంగా.........అక్కయ్య అప్పుడు ఎలాగూ వస్తుంది. ఇప్పుడు నేనెందుకు వెళ్లటం అక్కడికి' అన్నాను అమ్మతో.

నాకు ఎక్కడికీ వెళ్లాలని అనిపించటం లేదు. చివరికి స్నేహితురాండ్రతో షికారు వెళ్ళడానికి, సినిమాలు చూడటానికి కూడ మనసొప్పటం లేదు. ఏదో చెప్పలేని దిగులు నన్ను ఆక్రమించుకుంది. పిచ్చి పిచ్చి ఆలోచనలు ఆలోచిస్తూ చాలా సేపు గడిపేసేదాన్ని. దాంతో నా ఆరోగ్యం దెబ్బతింది.

అమ్మ నాలో కలిగిన మార్పును గమనిస్తూ వుంది కాబోలు ఓ రోజున 'మన చిన్నమ్మాయికి పెళ్ళిచేసేస్తే మంచిదేమోనండీ. ఎప్పుడూ ఏదో పరధ్యానంగా వుంటూంది. చదువుమీదకూడ శ్రద్ధ చూపటం లేదు' అని అమ్మ నాన్నగారితో చెప్పడం నేను విన్నాను.

'నాకు అలానే అనిపిస్తూంది. వెతికి చూద్దాం' అన్నారు నాన్నగారు.

నా మనస్సులో రాయి పడ్డట్లయింది. నాకు పెళ్ళా! నేను దిగులుగా, పరధ్యానంగా వుంటున్నది నాకు పెళ్ళికాలేదనా! నా కిప్పుడప్పుడే పెళ్ళొద్దు. అసలు నేను పెళ్ళే చేసుకోనని వాళ్లతో చెప్పాలనుకున్నాను.

తను కిష్టంలేని వ్యక్తిని పెళ్ళాడి, అతన్ని ప్రేమించలేక మనసివ్వలేక కాపురం చేస్తున్న స్త్రీలు వుంటే వుండవచ్చుకాని అది నా వల్లకాదు అనుకున్నాను.

నాలో మెరుపులా ఒక ఆలోచన మెరి

కూరలూ గుణాలూ:

## చిక్కుడుకాయ

చిక్కుడుకాయకూర చలవచేసి నీరుపెడుతుంది. హృదయాన్ని, ఊపిరితిత్తుల్ని బ్రహ్మండంగా వీనికి సత్తువ కలుగజేస్తుంది. విషపదార్థాలను హరించడానికి తోడ్పడుతుంది. శుష్క రసాల్ని పుట్టనివ్వదు. పుంసత్వాన్ని హెచ్చిస్తుంది. మూత్రం బాగ అయేటట్లు చేస్తుంది. మూత్రపు సంచిలో పుట్టేటు రాళ్లను తొలగించడానికి తోడ్పడుతుంది. బాలింతలగు స్త్రీలకు చనుబాలు అధికమయేటట్లు చేస్తుంది.

విరేచన బద్ధం, గురుత్వం, అజీర్ణం, కడుపునొప్పి చేస్తుంది. కడుపులో వాతాన్ని పుట్టిస్తుంది. విదాహాన్ని కలుగజేస్తుంది. సీరసాన్ని కలుగజేస్తుంది. మెదడుకు, కళ్లకు నష్టాన్ని కలుగజేస్తుంది. శ్లేష్మాన్ని పెంచుతుంది. పైత్యాన్ని హెచ్చిస్తుంది.

చిక్కుడు గింజలు వేడిచేసి నీరసాన్ని కలుగజేస్తాయి. నేత్రరోగం, క్షయ, విదాహం, కడుపుబ్బు, అపానవాయువు వీనిని పుట్టిస్తాయి. పైత్యాన్ని హెచ్చిస్తాయి.

గోరుచిక్కుడుకాయ చలవచేసి ఆర్చును. మిక్కిలి పైత్యం చేస్తుంది. అజీర్ణం, కడుపుబ్బు పుట్టిస్తుంది.

దీనికి విరుగుళ్లు:— 1. వాము 2. సొంఠి, కరక్కాయ పిందెలు, ఉప్పు ఈ మూడింటి చూర్ణము 3. జీర్ణౌషధములు 4. నీళ్లలో బాగా ఉడికించి వార్చడం 5. బాదం నూనెలో పొగచడం, 6. పుదీనా, లవంగాలు మొదలగు మసాలా వస్తువులువేసి వండడం.

సేకరణ:- ఆకుండి రామనారాయణమూర్తి

సింది. అది ఈ సారి బావ వచ్చినప్పుడు నన్ను పెళ్ళి చేసుకుంటాడేమో అడగాలని. ఎందరికి లేరు యిద్దరు పెళ్ళాలు! అందులో తప్పుగాని, ఏదో చేయరాని పని గాని వున్నట్టు నా కనిపించలేదు. ఇక అక్క సంగతి—నేను తన జీవితంలోవచ్చి భాగం పంచుకుంటానంటే ఒప్పుకోకుండా పోతుందా? తన తోబుట్టువు గురించి ఆ మాత్రం చిన్నత్యాగం చెయ్యలేకపోతుందా?

ఇటువంటి ఆలోచనలతో నేనా రాత్రి నిద్రపోయాను...


బావా నేనూ 'రిజిష్టర్ మేరేజస్' జరిపే ఆఫీసుకి వెళ్ళాం. ఆ ఆఫీసులోని ఆఫీసరుతో బావ ఏదో మాట్లాడేడు. ఆ ఆఫీసరు చిరునవ్వు ముఖంతో మావైపు చూస్తూ వొకరిజిస్టరు (పుస్తకం) చూపించి అందులో సంతకాలు పెట్టమన్నాడు. అంగీకారసూచకంగా మేమిద్దరం సంతకాలు పెట్టాం. మా ఇద్దరిచేతుల్లో రెండు పూలదండలున్నాయి. నా దగ్గర వున్న పూలదండను బావ మెడలో వేశాను. బావ తనవద్దనున్న పూలదండను నా మెడలో వేసాడు. ఆనందంతో పరవశించి పోతూ ఎన్నో కోరికలను నింపుకున్న కళ్ళతో బావవైపు చూశాను. బావ నా వైపు చిరునవ్వు చిందిస్తూ చూశాడు. ఆ చూపుల తూపులను భరించలేక సిగ్గుతో ముడుచుకు పోయాను నేను. అలా ముడుచుకుపోయిన నన్ను తన బలిష్ట

# నా బావ

మైన హస్తాలతో చుట్టేసి ముద్దుపెట్టుకున్నాడు బావ, ఆఫీసరు వున్నాడన్న సిగ్గయినా లేకుండా.

ఆటు తర్వాత ఆఫీసరు దగ్గర సెలవు తీసుకొని అక్కడినుండి బయటకు నడిచాం మేమిద్దరం. ఇంకా ఆఫీసుగది గుమ్మం దాటలేదు. అంతలోకే ఎవరో నల్లటి ముసుగు వేసుకున్న స్త్రీ ఆగదిలోకి వచ్చి, తనవద్దనున్న పిస్టల్‌ను బావవైపు గురి పెట్టింది. నేను భయంతో కంపించి పోయాను అంత బలశాలి, ధైర్యశాలి అయిన బావ ఏమీచెయ్యకుండా ఆమెను చూస్తూ బొమ్మలా నిలబడిపోయాడు, ఆ ముసుగులో వున్న స్త్రీ పెద్దగా నవ్వుతూ రెండుసార్లు పిస్తోలును పేల్చింది. ఆ మరుక్షణమే బావ 'మీనా!...' అంటూ నేల కూలి పోయాడు.

'బావా!...' అంటూ గట్టిగా కేక పెడుతూ నిద్ర లోనుంచి లేచిపోయాను నేను. నావళ్ళు చల్లబడిపోయింది, గుండె వడివడిగా కొట్టుకుంది. కాని అంతట్లోనే వచ్చింది కలమాత్రమేనని, నిజం కాదని గ్రహించాను. కాస్సేపటికి నాగుండె దడ తగ్గింది. నాకొచ్చిన కలలో మంచిది మాత్రమే నిజంచెయ్యమని ఆ శ్రీనివాసుణ్ణి మనస్సులోనే తలచుకొని నమస్కరించాను.




యింట్లో ఎవ్వరూ నిద్రలేచినట్టు లేదు. నేను నిద్రలోపెట్టిన కేక ఎవరికీ వినిపించలేదేమో!

నేను మట్టుకు మేలుకునే వున్నానంటూ ముందు హాలులోవున్న గోడ గడియారం నాలుగు కొట్టింది.

కాస్సేపు కన్నుకలపరించి ఆలోచిస్తూ మంచంమీద అటూ ఇటూ దొర్లాను. నాకు తిరిగి ఎప్పుడు నిద్రపట్టిందో పట్టేసింది.

యెవరివో ఏడుపులు వినబడేసరికి వులికిపడి నిద్రలోనుండి మేలుకున్నాను. ఆ ఏడుపు అమ్మదేనని తెలిసేక నాకు కంగారు పుట్టింది.

'...అయ్యోతల్లీ, అప్పుడే నీకు నూరేళ్ళు నిండాయా? అయ్యో భగవంతుడా' అంటూ అమ్మ రోదిస్తూంది.

నాకేమీ అర్థం కాలేదు. కాని ఏదో కీడు ఎవరికో జరిగిందని మాత్రం అనుకున్నాను, అంతలోనే నాన్నగారు గాభరాగా నా దగ్గరికి వచ్చారు. ఆయనచేతిలో టెలిగ్రాం చూసేసరికి నాకు నోట మాట రాలేదు. ఏం జరిగిందన్నట్టుగా ఆయన వైపు చూశాను.

'అక్కయ్యా, అత్తయ్యా ఎంట్రిక్ షాక్ తగిలి రాత్రి చనిపోయారటమ్మా. వెంటనే బయలుదేరి రావలసిందిగా బావ టెలిగ్రాం ఇచ్చాడు' అంటూ నాన్నగారు దుఃఖాన్ని ఆపుకోలేక ఏడ్చేశారు. అంతలోనే తేరుకొని 'టాక్సీ తీసుకు వస్తాను. బయలుదేరడానికి సిద్ధంగా వుండండి.' అని, బైటకి వెళ్ళిపోయారు.

నాన్నగారు చెప్పింది నేను నమ్మలేక పోయాను. 'ఇదికూడా కలలోఒక భాగమేమో!' అనిపించింది. కాని అమ్మను చూసేసరికి అలా అనిపించలేదు.

అమ్మదగ్గరకి వెళ్ళి నేను కూడ దుఃఖించకుండా వుండలేక పోయాను తమ్ముడు జరిగిందేమిటో సరిగా అర్థం కాక దిక్కుమొహం వేసుకొని నిలబడి పోయాడు.

అప్పటికే ఈ దుస్సంఘటన మాయింటి చుట్టుప్రక్కల వాళ్ళకి తెలిసిపోయింది. వాళ్ళంతా వచ్చి అమ్మను ఓదారుస్తూ తమ సానుభూతిని తెలుపుతున్నారు.

మరో పావుగంటకి నాన్నగారు టాక్సీ తీసుకువచ్చారు.

నేను వాళ్లతో వెళ్లడానికి నిరాకరించాను. నేను రాన న్నాను. నే నెందుకు రానంటున్నానో వాళ్లకి అర్థంకాలేదు.

'నా తల్లీ! కడసారిగా అక్కను చూసుకోవా?' అంటూ దీనంగా అడిగారు నాన్నగారు.

'లేదు నాన్నగారూ నేను రాలేను. అక్కయ్యను నేను చూడలేను... మీరు వెళ్ళిరండి...నన్ను మట్టుకు రమ్మని బలవంతం చెయ్యకండి.' అన్నాను. నాన్నగారు ఏమనుకున్నారో ఏమో 'సరే నీ యిష్టం' అన్నారు. అమ్మకూడ నేను రానంటే ఎదురు చెప్పలేదు.


మరి కాస్సేపటికి వాళ్లంతా ఎలా వున్నవాళ్లు అలా బయల్దేరి వెళ్లిపోయారు టాక్సీలో.

వాళ్లు వెళ్లిపోయాక, అక్కా నేనూ కలిసి తీయించుకున్న ఫోటో దగ్గరికి వెళ్ళి చాలా సేపటిదాకా విలపించాను. ఏదో తప్పుచేసిన దానిలా నన్ను క్షమించ గలిగితే క్షమించమని అక్కను వేడుకున్నాను.

'నా వుసురు తగిలి అక్కపోయింది. నా వుసురు తగిలే అక్కతోపాటు అత్తయ్యకూడా పోయింది. బావను వంటరి వాణ్ణి చేశాను...నేను పాపిష్ఠిదాన్ని'... అలా నన్ను నేను నిందించుకోకుండా వుండలేకపోయాము. ●


# పళ్ళలోని పగుళ్ళతో బాధపడటం దేనికి?






## బినాకా ఫ్లోరైడ్ వాడండి

ఇది మీ పళ్ళలోని పగుళ్ళు మిమ్మల్ని బాధ పెట్టకుండానూ, దంతక్షయానికి దారి తీయకుండానూ చేస్తుంది. బినాకా ఫ్లోరైడ్ మీ పళ్ళను గట్టి పరచి, ఆరోగ్యవంతంగా ఉంచుతుంది. దంతక్షయానికి దారి తీసే పక్షంలో, పంటి ఎనామిల్ దెబ్బ తిన నియ్యకుండా ముమ్ముందుగానే కాపాడుతుంది.

బినాకా ఫ్లోరైడ్—భారత దేశంలోని ఒకే ఒక ఫ్లోరైడ్ టూత్ పేస్ట్—దీనిలో మాత్రమే సోడియమ్-మోనో-ఫ్లోరో-ఫాస్ఫేట్ (యస్.యమ్.ఎఫ్.పి) ఉంది. ఇది—

- నోటిలో హానిచేసే ద్రవపదార్థాల్ని తయారు చేయకుండా చేస్తుంది
- పంటి ఎనామిల్‌ని గట్టి పరుస్తుంది
- బాధపెట్టే పంటి పగుళ్ళను రాకుండా అరికడుతుంది

దంతక్షయాన్నీ, పంటి పగుళ్ళని
అరికడుతుంది మూడు రకాలుగా
—బినాకా ఫ్లోరైడ్

CIBA Cosmetics

ULKA-CF-27 TEL